కథ

కె.కె.భాగ్యశ్రీ

# క్షమించు సుగుణా...

"నా మాట విని ఈ ఒక్క ముద్దా తినేయమ్మా" అయిదేళ్ల కూతురిని బ్రతిమలాడుతోంది సుగుణ అరగంట నుండీ.

"ఉహు...నాకొద్దు..." మారాం చేస్తున్నట్లుగా తల అడ్డంగా ఊపింది సృజన.

"మా తల్లివి కదూ... రాత్రి బువ్వ తినకుండా పడుకున్నావనుకో... ఆకలి రాముడు ఏడుస్తాడు. రాత్రంతా నీ బొజ్జలో అటు-ఇటు పరిగెడుతూనే ఉంటాడు.." ఏదో పిట్ట కథ చెప్పి కూతురి చేత రెండు ముద్దలు తినిపించాలన్న తపనతో అంది సుగుణ.

"ఆకలిరాముడా!" సృజన కళ్లల్లో చాలా సహజమైన కుతూహలం కనిపించింది.

చటుక్కున అరటిపండు ముక్క తృంచి పెరుగన్నంలో ఉంచి, తెరచిన కూతురి నోటిలో పెట్టేస్తూ "ఊ... ఆకలిరాముడే... మనం కడుపునిండా బువ్వ తినలేదనుకో వాడికి ఆకలి వేసి ఊరందరి ఇళ్లల్లోనూ ఆఖరుకి దోభీలు రేవులో బట్టలు ఉడకపెట్టే బానల్లోనూ కూడా వెతుక్కుంటాడుట. అందుకే మనం ఖాళీ బొజ్జతో బజ్జుంటే, సగం రాత్రప్పుడు కడుపులో గుడ-గుడమంటుంది" వివరించి చెప్పింది సుగుణ.

తల్లి మాటలు యదార్థమో, కాదో ఆలోచించలేని వయసు సృజనది. అందుకే సుగుణ చెప్పిన కథ వింటూ అన్నం తినడం పూర్తి చేసింది.

తృప్తిగా నిట్టూర్చింది సుగుణ. కడుపు నిండితే నిద్ర మధ్యలో లేచి ఏడవదు. అందుకే ఇలా చిట్టి పొట్టి కల్పిత కథలు చెప్పి అన్నం తినేలా చేస్తుంది.

సృజన మూతి తుడిచి, తన చేతులు శుభ్రం చేసుకుంటూ "రండి... భోజనం వడ్డిస్తాను" అంటూ భర్తను పిలిచింది.

పేపర్ మీద ఏదో దీక్షగా రాసుకుంటున్న శ్రీకాంత్ "అయిందా పుత్రికారత్నం గారి విందు భోజనం" అడిగాడు నవ్వుతూ.

తనూ నవ్వింది సుగుణ.

"ఏం చేయను... ఇంత హైరానా పడితే గానీ మీ చిట్టితల్లి ముద్ద నోటపెట్టదు" అంది మురిపెంగా.

శ్రీకాంత్ పెన్ను మూసి, కాగితాలన్నీ నీట్‌గా సర్దేసి ఓ వారగా పెట్టి భోజనానికి కూర్చున్నాడు.

"మొత్తానికి మంచి కథే వినిపించావు నీ కూతురికి" అన్నాడు.

"సహవాస దోషం మరి! ఎంతైనా రచయితగారి శ్రీమతిని కదా! అవునూ... ఏదో కొత్తకథ రాస్తున్నానన్నారు కదా! ఎంతవరకు వచ్చింది దాని వ్యవహారం. పోటీకి గడువు తేదీ అయిపోవస్తోంది కూడాను" అంది సుగుణ అతడికి అన్నం వడ్డిస్తూ.

"అయిపోవచ్చింది. రేపు పంపేస్తాను. నువ్వొకసారి చదివి అభిప్రాయం చెబితే..." చెప్పాడు శ్రీకాంత్ కూర కలుపుకుంటూ.

"బాగుంది. మధ్యలో నా అభిప్రాయం దేనికి? నేనేమన్నా న్యాయనిర్ణేతనా! అయినా మీకిదేం సెంటిమెంటండీ... నేను చదివితే గానీ పంపనంటారు" ముద్దుగా విసుక్కుంది సుగుణ. మనసులో మాత్రం లోలోపల మురిసిపోతూనే ఉంది.

భర్తకు తన మీదున్న ప్రేమ ఆమెకు తెలియనిది కాదు. అయినా అదొక సరదా.

"నువ్వు చదివి విశ్లేషిస్తే గానీ నాకు తృప్తిగా ఉండదు. పైగా నా తొలి పాఠకురాలివి నువ్వే కావడం నాకొక సెంటిమెంట్. ఆ కథ ఖచ్చితంగా పత్రిక వారు స్వీకరిస్తారు" అన్నాడు ఆరాధనగా అర్ధాంగి కళ్లల్లోకి చూస్తూ.

సుగుణ పులకించిపోయింది. భర్తకు తన మీద ఉన్న ఆరాధనకు పొంగిపోయింది. అలాంటి మాటలు అతడి నోట వినాలనే ఆమె అలా మాట్లాడుతుంది.

భోజనం చేయడం ముగించిన శ్రీకాంత్ "త్వరగా పని పూర్తి చేసుకుని వచ్చి సృజనని పడుకోబెట్టు. నేనీలోగా కథ కంప్లీట్ చేస్తాను" అన్నాడు.

అతడి మాటల్లోని గూఢార్థం అర్థం చేసుకోలేనంత అమాయకురాలు కాదు సుగుణ. ముసిముసిగా నవ్వుతూ, కవ్వింపుగా చూసింది భర్త వైపు.

"అలా మత్తుగా చూడకు. పనులన్నీ పెండింగ్‌లో పడిపోగలవు" కోరిక నిండిన చూపులతో ఆమెను తడుముతూ అన్నాడు శ్రీకాంత్.

* * *

శ్రీకాంత్, సుగుణలది అన్యోన్య దాంపత్యమని అంగీకరిస్తారు వారి సంసారం కన్నులారా గాంచిన సన్నిహితులందరూ. వారి అనురాగ ఫలం అయిదేళ్ల సృజన.

శ్రీకాంత్ ఇప్పుడిప్పుడే రచయితగా పైకొస్తున్నాడు. ఈ విషయంలో అతడికి సుగుణందించే సహకారం అంతా ఇంతా కాదు. అతడు రాసిన ప్రతి రచననూ శ్రద్ధగా చదివి చక్కటి విమర్శ చేస్తుంది.

తన ఎదుగుదల వెనుక అర్ధాంగి అండదండలు ఉన్నాయన్న వాస్తవాన్ని గ్రహించిన శ్రీకాంత్ ఆమెను ఎంతో అపురూపంగా చూసుకుంటాడు. భర్త ఉన్నతిని కాంక్షించే సుగుణ అతడి మనసుకనుగుణంగా నడుచుకుంటుంది.

తానొక ప్రముఖ రచయితగా పేరు తెచ్చుకోవాలన్న తపన అధికమవుతోంది శ్రీకాంత్‌కీమధ్య. ఆ దిశగా కృషి చేస్తున్నాడు కూడా. అతడి ఆశ ఫలించి, ఆంధ్ర దేశంలోని పేరున్న రచయితలలో ఒకడైనాడు.

భర్త కీర్తిప్రతిష్ఠలలోనే తన సంతోషం ఇమిడి ఉందని భావించే సుగుణ, అతడు సాధించిన ప్రగతి చూసి ఆనందిస్తోంది.

* * *

"అమ్మా ఆకలి..." వీధిలో ముసలి బిచ్చగాడి కేక వినబడి, ప్లేట్లో కాస్త అన్నం, కూర పెట్టుకుని వచ్చింది సుగుణ.

ఈమధ్య ఎవరు అడుక్కున్నా సరే... లేదనకుండా ఎంతో కొంత వేయడం అలవాటైంది ఆమెకు.

అదీ సృజన కోరిక మేరకే.

ఓనాడు ఏదో పని సందట్లో ఉండి "చేయి ఖాళీ లేదు... వెళ్లెళ్లు..." అంది సుగుణ.

అది గమనించిన సృజన "అయితే ఇవాళ ఆకలి రాముడు నా బొజ్జలో ఉండదన్నమాట!" అంది నిట్టూరుస్తూ.

"అదేంటే?" విస్తుపోయింది సుగుణ.

"నువ్వే కదా చెప్పావు... బువ్వ తినకుండా బజ్జుంటే కడుపులో ఆకలిరాముడు గోల పెడతాడని. పాపం ఆ ముసలి తాత బువ్వ తినలేదు. మరి తాత బొజ్జలో ఆకలిరాముడు గుడ-గుడమంటాడు కదా!" చిన్ని బుర్రలో ఉత్పన్నమైన సందేహాన్ని బయలుపరి

చింది సృజన.

ఆ పసిదాని లాజిక్‌కి ఆశ్చర్యచకితురాలైంది సుగుణ. అంతే కాదు... ఇంత చిన్న వయసులోనే పక్క వాడి ఆకలిని అర్థం చేసుకునే సౌహార్ద్రత ఆమెకున్నందుకు గర్వపడింది కూడా.

అందుకే... గుమ్మం ముందు ఎవరు 'ఆకలి' అని కేకపెట్టినా, లేదనకుండా ఒక్క పిడచైనా వేయడం అలవాటు చేసుకుంది.

అలవాటు ప్రకారం ముసలి తాతకి అన్నం పెట్టి వస్తూంటే "పోస్ట్" అని అరిచాడు పోస్ట్‌మాన్.

అతడు కింద పడేసిన ఉత్తరాలను తీసి పరిశీలనగా చూసింది సుగుణ.

ఈమధ్య శ్రీకాంత్‌కి ఫాన్‌మె
ం ు ు ల్

ఎక్కువైంది. అడపాదడపా ఎవరోఒకరు అభిమానులు ఉత్తరాలు రాస్తూనే ఉన్నారు.

అప్పుడప్పుడు ఆడ అభిమానులు కూడా తమ అభిప్రాయాలను తెలుపుతూనే ఉన్నారు. ఫ్రమ్ అడ్రస్‌లు చూసి అవి ఓపెన్ చేయకుండానే అక్కడే పెట్టేస్తుంది సుగుణ.

ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో ఒక కవరుపై ఫ్రమ్ అడ్రస్ లేదు. చేతిరాత చూస్తే సుపరిచితమైనదిగా అనిపించింది.

"ప్రదీపే రాసుంటాడు..." అనుకుంటూ కవర్ ఓపెన్ చేసింది సుగుణ.

ప్రదీప్ ఆమె మరిది. సుగుణ కాపురానికి వచ్చేసరికి పన్నెండేళ్ల కుర్రాడతడు. అనుక్షణం "వదినా...వదినా" అంటూ ఆమె వెనుకే తిరిగేవాడు.

సుగుణ పెళ్లికి ముందే మామగారు పోయారు. ఆ పెళ్లయిన ఏడాది తరువాత అత్తగారూ పోయింది.

తల్లిని - తండ్రిని కోల్పోయిన చిన్నారి ప్రదీప్‌కి ఆ లోటు తెలియనివ్వకుండా పెంచేందుకు తన మాతృత్వాన్ని ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా ఎనిమిదేళ్ల పాటు వాయిదా వేసింది సుగుణ.

తనలోని మమకారాన్నంతా పంచి, ప్రదీప్‌ని ప్రాజ్ఞుడిని చేసింది.

చదువు మీద అంతగా శ్రద్ధ లేని అతడు ఆర్మీలో చేరిపోయాడు.

ఇంటికి దూరంగా ఎక్కడో దేశ సరిహద్దుల్లో నివాసం.

తనను తల్లిలా సాకిన వదిన మీద గౌరవంతో వారానికో ఉత్తరం రాస్తాడు ప్రదీప్.

ఆ రోజు వచ్చిన ఉత్తరం అతడు రాసినదేమో అని భ్రమపడి ఆతృతగా చింపింది సుగుణ.

ఆమె భావించినట్లుగా అది ప్రదీప్ రాయలేదు.

ఎవరో అమ్మాయి రాసింది.

దాన్ని పూర్తిగా చదవకుండానే మడిచి తిరిగి కవర్‌లో పెట్టేసింది సుగుణ. ఎదుటి వ్యక్తికి వచ్చిన ఉత్తరాన్ని చదివే కుసంస్కారం ఆమెకు లేదు.

అసలు ప్రదీప్ రాసిన ఉత్తరమూ అన్నయ్యను సంబోధిస్తూ రాసినదే.

అతడు ఆర్మీలో చేరినపుడు రాసిన తొలి ఉత్తరాన్ని చదవడానికి సుగుణ సంకోచిస్తే...

"వాడికి అమ్మలేని లోటు తెలియకుండా పెంచి, పెద్దవాడిని చేసినది నువ్వు. అలాంటిది వాడు రాసిన ఉత్తరాన్ని చదవడానికి ఆలోచిస్తున్నావెందుకు? కవర్ మీద అడ్రస్ నాదైనా, లోపల క్షేమ సమాచారమంతా నీ కోసమే. నిరభ్యంతరంగా చదవచ్చు"



అన్నాడు శ్రీకాంత్.

ఈ రోజూ అది రాసింది ప్రదీపేనని అనుకొని కవర్ ఓపెన్ చేసింది.

'ప్రదీప్ దగ్గర్నుండి ఉత్తరం రాలేదెందుకో' భారంగా నిట్టూర్చి శ్రీకాంత్ లెటర్స్ అన్నీ అతడి టేబుల్ మీద సర్దేసింది.

ప్రదీప్‌కి ఫోన్‌లో మాట్లాడ్డం కన్నా, ఉత్తరం రాయడమంటేనే ఇష్టం. ఎంత పనున్నా వారానికో లెటర్ రాస్తాడు.

సాయంత్రం శ్రీకాంత్ ఆఫీస్ నుండి వచ్చి, ఫ్రెష్ అయి తనకొచ్చిన ఫాన్ మెయిల్ అంతా చూసుకోసాగాడు.

సుగుణ ఓపెన్ చేసిన కవర్‌ని చూసి, లోపల ఉన్న ఉత్తరాన్ని తీసి చదవసాగాడు.

ఆ ఉత్తరం తెనాలి నుండి శ్రీకళ అనే అమ్మాయి రాసింది. శ్రీకాంత్ రచనలను పొగుడుతూ, అతడిని ఆకాశానికెత్తేస్తూ చాలా పెద్ద ఉత్తరమే రాసింది.

చదువుతున్న శ్రీకాంత్ భుజాలు గర్వంతో పొంగి వెడల్పయినాయి. ఆడ అభిమానులు ఉత్తరం రాయడం అతడికి కొత్త కాకపోయినా, ఎందుకో ఈ ఉత్తరం అతడి మదిలో ఒక అలజడి సృష్టించింది. మనసంతా ఏదో రమ్యానుభూతితో నిండిపోయింది.

అంతలోనే... ఆ కవర్ సుగుణ ఓపెన్ చేసినందుకు కాస్త కోపం కూడా వచ్చింది.

"సుగుణా.. సుగుణా..." అరచినట్లుగానే పిలిచాడు.

వంటగదిలో బిజీగా ఉన్న సుగుణ హడావుడిగా తడి చేతులను కొంగుతో తుడుచుకుంటూ "ఏంటండీ" అంటూ వచ్చింది.

"ఈ... ఈ లెటర్ ఎందుకు ఓపెన్ చేశావు" అడిగాడు కాస్త కరుగ్గా.

ఎన్నడూ లేనిది, అతడి వాక్కులలో పరుషత్వం గమనించిన సుగుణ మనసు కలుక్కుమంది.

"సారీ... ప్రదీప్ రాసినదనుకొనీ..." అంది సంజాయిషీ చెప్తున్నట్లుగా.

శ్రీకాంత్ గిల్టీగా ఫీలయ్యాడు. భార్య తనను అనుమానించి ఆరాలు తీస్తోందేమోనన్న ఆలోచన అతడిని కుదురుగా ఉండనివ్వలేదు.

కోపంగా ఆమెకేసి చూస్తూ "ప్రదీప్ రాస్తే మాత్రం, నాకే కదా రాస్తాడు. దాన్ని విప్పి చదవవలసిన అవసరం నీకేంటి?" అన్నాడు హఠాత్తుగా గొంతు పెంచి.

నిర్ఘాంతపోయింది సుగుణ.

'తన భర్తేనా! ఇలా మాట్లాడుతున్నదీ...ఎప్పుడు ప్రదీప్ ఉత్తరం రాసినా ముందుగా చదివేది తనే. తను ఉత్తరం చదవడానికి సంకోచిస్తే, ఆ హక్కు తనకుందని స్పష్టం చేసింది అతడే.




ఆ ఉత్తరం తను చింపిందని ఇంతగా కంగారుపడి, చిందులు తొక్కుతున్నాడంటే దానర్థం ఏమిటి? తనను పరాయిగా భావిస్తున్నాడా? అతడిని - తనని వేరు చేసి మాట్లాడ్డం ఇదే మొదటిసారి. దీని పర్యవసానం ఏమిటి?'

ఇన్ని రకాల భావపరంపరలు ఒక్కసారిగా తన మీద మూకుమ్మడి దాడి చేయడంతో ఉక్కిరిబిక్కిరైంది సుగుణ. మనసు తీవ్రంగా గాయపడింది. కళ్లంట నీరు ఎగజిమ్మింది.

తన ముఖం అతడికి కనబడనీయకుండా తలపక్కకు తిప్పుకొని "సారీ... ఇంకెప్పుడూ మీకొచ్చిన ఉత్తరాలు విప్పను" చెప్పేసి గభాలున వంటింట్లోకి వెళ్లిపోయింది.

సృజనకెందుకో అమ్మ అలా బాధపడడం నచ్చలేదు. తండ్రివైపు అదోలా చూసి తల్లి వెంటే వెళ్లిపోయింది.

సృజనకి అన్నం తినిపించి, భర్తకు భోజనం వడ్డించి తన పనులు ముగించుకుని వెళ్లి పడుకుంది సుగుణ.

సృజనకి నిద్ర రావడం లేదెంతకీ. ఆ చిన్నారి బుర్రలో ఎన్నో ఊహలు కదలాడుతున్నాయి.

శ్రీకాంత్ గదిలోకి వచ్చేసరికి ఏదో ఆలోచిస్తున్నట్లుగా పైకప్పుకేసి చూస్తూ పడుకున్న కూతురు కనిపించింది.

"ఏరా బంగారూ... ఇంకా బజ్జోలేదా!" అడిగాడు ఆమెను గారంగా ముద్దులాడుతూ.

"లేదు నాన్నా... నాన్నా..." పిలిచింది ముద్దుగా.



## నచ్చితే చాలు

జెనీలియా తన పారితోషికాన్ని అంత పెంచేసిందీ, ఇంత పెంచేసిందీ అంటూ తెగ వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో వీటి మీద మీ కామెంట్ ఏంటి మేడమ్? అంటే- 'అసలు రెమ్యునరేషన్ విషయంలో పట్టింపు లేదు. కథ నచ్చితే చాలు, అది ఐదు నిమిషాల పాత్రయినా చేస్తాను' అంటోంది. అవున్లెండి... ఆమాత్రం దీప్తమనసీ వుండాలి, లేకపోతే ఎలా రాణించగలుగుతుంది!




"ఏం తల్లీ..." లాలనగా ఆమె తలనిమిరాడు శ్రీకాంత్.

"అన్నం తినకపోతే... ఆకలిరాముడు బొజ్జలో పరుగెడతాడని అమ్మ చెప్పింది కదా!"

"ఊ...అవును..."

"పాపం! ముసలి తాతకి ఆకలేస్తుందని రోజూ అన్నం కూడా పెడుతుంది కదా!"

"అవును తల్లీ... అయితే..." కూతురిన్ని ప్రశ్నలెందుకు గుప్పిస్తోందో అర్థం కాలేదు అతడికి.

"మరి... అమ్మ బువ్వ తినకుండానే బజ్జుంది కదా! అమ్మ బొజ్జలోనూ ఆకలిరాముడు పరిగెడతాడా?" అమాయకంగా సృజన అడిగిన ప్రశ్న శ్రీకాంత్ వివేకాన్ని తట్టి లేపింది. ఎవరో తనని చాచి కొట్టిన అనుభూతి కలిగిందతడికి.

సుగుణ అభోజనంగా పడుకుందా! ఇన్నేళ్ల కాపురంలోనూ ఆమె అన్నం మీద అలిగినది లేదు.

'అన్నం పరబ్రహ్మ స్వరూపం. దానిని కాలదన్నుకుంటే... కావల్సినప్పుడు పుట్టకపోవచ్చు...' అనేది తరుచుగా.

అలాంటిది... ఇవాళ తనే ఇలా... ఆమె మనసు ఎంత గాయపడుంటుందో కదా!

అనాలోచితంగా తానన్న మాట ఆమె హృదయాన్ని తూట్లు పరిచిందన్న మాట.

ఎన్నడూ లేనిది తనలా ప్రవర్తించాడేంటి? కన్నతల్లి కన్న మిన్నగా ప్రదీప్‌ని ప్రేమించే సుగుణకి అతడి దగ్గర నుండి వచ్చిన లెటర్ విప్పి చదివే అధికారం లేదా! మరి తన నోటి వెంట అలాంటి మాటలు వెలువడ్డాయేం?

అంటే మాలిన్యం తన మనసులోనే ఉంది. ఒక అమ్మాయి ఎంతో ఆరాధనను కురిపిస్తూ రాసిన ఉత్తరం తనలో లేనిపోని వికారాలు తలెత్తడానికి తావిచ్చిందా!

తనకు ఒక అభిమాని రాసిన ఉత్తరాన్ని చదివిన సుగుణ అసూయతో తనను అపార్థం చేసుకుంటుందేమోనన్న ఆలోచనే తన ఈ ప్రవర్తనకు కారణమా!

ఆ రకంగా ఆలోచించడం మొదలెట్టాక తన తప్పేంటో తనకి తెలిసి వచ్చింది శ్రీకాంత్‌కి.

ఆత్మవిమర్శ చేసుకునే మనిషి తనలోని తప్పిదాన్ని సులువుగా అంగీకరించగలుగుతాడు. మళ్లీ ఆ పొరబాటు పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాడు.

ఒక విషయం వారి వారి దృక్కోణాలను బట్టి రకరకాలుగా రూపాంతరం చెందుతుందనడానికి ఇదొక తార్కాణం.

తప్పు ఎదుటివారి ప్రవర్తనలో లేదు... తమ ఆలోచనల్లో ఉంటుంది.

కూతురు అడిగిన ప్రశ్నతో కళ్లు తెరిచిన శ్రీకాంత్ మనస్ఫూర్తిగా తను చేసిన పొరబాటును చక్కదిద్దుకోవాలనుకున్నాడు.

వంటింటిలోకి వెళ్లి కంచంలో అన్నం పెట్టుకొని, కూర కలిపి తీసుకొచ్చి "సుగుణా" అంటూ పిలిచాడు లాలనగా.

అతడి స్వరంలోని అపరాధ భావనను గమనించిన సుగుణ చప్పున లేచి కూర్చుంటూ "నిజంగా చెప్తున్నాను. ఆ లెటర్ ప్రదీప్ రాసినదేమో అనుకునే ఓపెన్ చేశాను. మీ పర్సనల్ లెటర్స్ చదవాలన్న ఆరాటం నాకు లేదు. ప్రదీప్‌ని పెంచిన ఈ చేతులకి, అతడు రాసిన ఉత్తరం చించి చదివే అర్హత లేదా?" భోరుమంది సుగుణ అతని హృదయం మీద వాలిపోతూ.

ముద్ద కలిపి ఆమె నోటికి అందిస్తూ "క్షమించు సుగుణా" ఆర్తిగా అన్నాడు శ్రీకాంత్ ఎటువంటి సంకోచమూ లేకుండా.



## అంతా మనీ మహిమ!

ఇప్పుడు టూపీస్ బికినీల్లో కనిపించడం అనేది కొత్త క్రేజ్ ప్లస్ మంచి గిట్టుబాటూనూ. తమిళ సినిమా 'బిల్లా'లో నయనతార టూపీస్ బికినీలో కనిపించిన దగ్గర్నుంచి దక్షిణాది తారల్లో చాలామంది ఇలా తామూ కనిపిస్తే మంచి పబ్లిసిటీతో పాటు డబ్బు గిట్టుబాటూ బావుంటుందని భావిస్తున్నారు. గతంలో టూపీస్ బికినీలో కనిపించిన నమిత కూడా మళ్లీ ఛాన్స్ వస్తే అలా తెరపై కనిపించి గిట్టుబాటు చేసుకుంటానంటోంది ఓపెన్‌గా. అంతే మరి!